క్లుప్తంగా

మాలమహానాడు ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్


శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మాలమహానాడు నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తిరుమలగిరి(సాగర్) మండలంలోని శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన జంగాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హాలియాలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అందజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వినోద్‌చారి


వినోద్‌చారి

చందంపేట: చందంపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా గుంటోజు వినోద్‌చారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షులుగా నాగిళ్ల రాములు, వెంకటియాదవ్, చిన్న, సతీష్‌చారి, ప్రధాన కార్యదర్శులుగా లింగాల శివకృష్ణ, రఘునాయక్‌తో పాటు కార్యదర్శులు, కోశాధికారులుగా మరికొందరిని నియమించారు.

దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డులో గల సాంఘిక సంక్షేమ బాలుర జూనియర్ కళాశాల గురుకులంలో స్టాఫ్ నర్స్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణానాయక్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన వాళ్లు ఈ పోస్టుకు అర్హులని అన్నారు. ఆసక్తి గలవారు నేరుగా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


బాధ్యతలు స్వీకరిస్తున్న నేరెడుగొమ్ము ఎస్‌ఐ కోటేష్

చందంపేట : మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని నేరెడుగొమ్ము ఎస్‌ఐ కోటేష్ హెచ్చరించారు. ఇటీవల నేరెడుగొమ్ము ఎస్‌ఐగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గూడూరు గ్రామంలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజుకు సమాచారం అందించడంతో ఆయన ఆదేశాల మేరకు ఆ ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

ఆశావర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ : దామరచర్ల మండలం ఆశా కార్యకర్తల నూతన కమిటీని శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా డి.మహేశ్వరి, కార్యదర్శిగా ఎస్.జయమ్మ, సహాయ ఉపాధ్యక్షులుగా శారద, కోశాధికారిగా ఇందిర, సహాయ కార్యదర్శిగా శ్రీదేవి, సభ్యులుగా పద్మ, కవిత, రమణకుమారి, గౌస్యాబేగంతోపాటు మరో 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్, పాపానాయక్, సావిత్రి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను శనివారం పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గత ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూమిలో నుంచి కొందరు వ్యాపారులు అక్రమంగా మట్టి తరలిస్తుండగా.. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తహసీల్దార్ రాగ్యానాయక్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కమలా నెహ్రూ ఆస్పత్రిలో రక్తదానం

నాగార్జునసాగర్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ కమలానెహ్రూ ఆస్పత్రిలో 22మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు మహారాజుల సేవాసంఘం సభ్యులు బద్రి, నకులరావు, రాందాస్ తదితరులు అరటి పండ్లు, ఉడికించినగుడ్లు, బిస్కట్స్ తదితర పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఎంఓ డాక్టర్ హరికృష్ణ, డా.పృథ్వీ, నర్సింగ్ సూపరింటెండెంట్ పలీనా, పద్మావతి, రక్తనిల్వకేంద్రం సిబ్బంది వీరబాబు, రాజు, దుర్గయ్య, సరిత, లీనాప్రియ, మధునవనీత పాల్గొన్నారు.

తడి, పొడి.. ఇక తప్పని సరి

- చెత్త సేకరణపై మున్సిపల్ శాఖ ఆదేశం
- అవగాహన కల్పించినా వేరు చేయని ప్రజలు
- పారిశుద్ధ్య కార్మికులు ఒకే దగ్గర డంపు చేస్తున్న వైనం

మిర్యాలగూడ టౌన్ : ఇంట్లో చెత్త చెదారం ఒకే డబ్బాలో వేసి స్వచ్ఛ ఆటోలకు ఇస్తున్నారు. ఇందులో తడి,పొడి చెత్తను కలిపి ఉండగా అలాగే డంపింగ్ యార్డులకు తరలిస్తుండటంతో టన్నుల కొద్ది పెరుకుపోతుంది. చెత్త ఉత్పత్తిని తగ్గించడం..ప్రత్యామ్నయ మార్గాలు అన్వేషించడం ప్రజలకు అవగాహన కల్పించినా మార్పులు రాకపోవడంతో వందరోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలను జారీ చేసింది.

అవగాహన లోపం

మున్సిపల్ అధికారులు చెత్తపై కొత్త సమరం కార్యక్రమం ద్వారా పట్టణ ప్రజలకు తడి చెత్తను పొడి చెత్తను వేరు చేయు విధానంలో కూడా సరైన అవగాహన కల్పించకపోవడంతో అధికారులలో లోపం కనిపిస్తుంది. ప్రతి వార్డులో అవగాహన కార్యక్రమాలను నిర్వహించకుండా కేవలం కాగితాలకే పరిమితం కావడంతో రోడ్లపైనే తడి, పొడి చెత్తను వేస్తున్నారు. తడి, పొడి చెత్తను ట్రాక్టర్ల ద్వారా కూడా సరిగా వేరు చేయడం లేదు. కాగా చెత్తను ఒకే డబ్బాలో వేయకుండా చిత్తు కాగితాలు, పేపర్లు, ప్లాస్టిక్, మెటల్స్‌లవి పనికి రాకుండా పోతుంది. చెత్తలో రెండు రకాలు కాగా పొడి చెత్తలో పేపర్లు, కవర్లు, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు, మెటల్స్ వంటి ఉత్పత్తి అయిన చెత్తలో 40శాతం వరకు పొడి చెత్తగా ఉంటుంది. తడి చెత్తలో కూరగాయలు, అన్నం, కూరగాయాల తుక్కు, ఆకులు, పండ్ల తొక్కలు, గింజలు తదితర ఆహార పదార్థాల ఉత్పత్తి 60శాతం ఉంటున్నందున వీటిని ఎరువుల తయారీకి ఉపయోగించుకోవచ్చని అధికారులు చెప్పుతున్నప్పటికీ దీనిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. తడి చెత్త, పొడి చెత్తను రీ–సైకిల్ విధానంతో పొడి చెత్తను సక్రమంగా ఉపయోగించుకోవచ్చు కానీ రీ–సైకిల్ చేసేందుకు మాత్రం ప్రక్రియ మాత్రం తూతూ మంత్రంగా ఉంటుంది.


మిర్యాలగూడ టౌన్ : చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న డోర్ లేని ట్రాక్టర్

అంతా ఒకే దగ్గర..

కొంత మంది ఇంటి యాజమానులు ఇప్పటికీ తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇస్తుండగా మరి కొంత మంది మాత్రం తడి, పొడి చెత్తను వేరు చేయకుండానే రెండు కలిపి ఒకే డబ్బాలో వేసి ఇస్తున్నారు. చెత్తనను సేకరించే ఆటోలు, ట్రాక్టర్లు కూడా వేర్వేరు చెత్తను వేసుకోవాల్సి ఉండగా అంతా ఒకే దగ్గర కుమ్మరించి తరలిస్తున్నారు. పొడి చెత్తలో కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు, అట్టాలు వెంటనే తిసుకోని మిగితావి డంపింగ్ యార్డుకు తరలిస్తుండగా మరి కొంత మంది ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ల డ్రైవర్‌లు మాత్రం అన్ని కలిపి తీసుకెళ్తున్నారు. ప్రధానంగా తడి చెత్తను వర్మీకంపోస్ట్ చేయాల్సి ఉండగా అది చేయడం లేదు. దీంతో గుట్టలు గుట్టలుగా పెరుకుపోతుంది.

ఇలా చేయాలి

- తడి చెత్తను ఆకు పచ్చని రంగు డబ్బాలో, పొడి చెత్తను నీలిరంగు డబ్బాలో వేసి ఇంటింటికి వచ్చే ఆటో, ట్రాక్టర్లకు వచ్చే వాహనాలకు అందించాలి. కార్మికులు కూడా అలా వేరు చేసి ఇవ్వాలని సూచించాలి.
- ఆటోలకు సైతం రెండు అర్రలను ఏర్పాటు చేయాలి,
- తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై ఇంటింటా ప్రచారం చేయాలి.

అవగాహన కల్పిస్తాం



మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త వేరు చేయు విధానంపై త్వరలోనే స్పెషల్ డ్రైవ్ ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. అదే విధంగా మున్సిపాలిటీ చెత్త వాహనదారులకు తడి, పొడి చెత్త వేరు చేసే విధంగా చర్యలు చేపడతాం. ఈ విషయంపై వాహనదారులకు కూడా అవగాహన కల్పించడంతో పాటు వార్డుల్లో చెత్త వేయకుండా చూస్తాం. ప్రజలు కూడా వార్డుల్లోకి వచ్చే వాహనాలలో తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో అత్యంత పరిశుభ్ర పట్టణంగా మిర్యాలగూడను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఉదయం 5గంటల సమయంలో మున్సిపాలిటీలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత విషయంలో గతంలో మాదిరిగానే మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి స్వచ్ఛ మిర్యాలగూడగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య విషయంలో బాధ్యతగా పనిచేయలేమనుకున్న వారు విధుల నంచి తప్పుకోవాలన్నారు. బాధ్యతగా పనిచేసే కార్మికులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటూ వారికి కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మిర్యాలగూడను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

తెలంగాణ సాంస్కృతిక కళాజాత పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ : జూలై 5న పట్టణంలోని కళాభారతిలో నిర్వహించే తెలంగాణ సాంస్కృతిక కళాజాత పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర కళాకారులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎనలేనిదన్నారు. అదేవిధంగా తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ మాట్లాడుతూ జూలై 5న కళాభారతిలో నిర్వహించే కళాజాతకు రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులు హాజరువుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దారం మల్లేష్‌యాదవ్, కందుకూరి సుదర్శన్, ఆదిమల్ల ఎల్లయ్య, రెమడాల శ్రీనివాస్, సత్యనారాయణ, వేణు, నల్ల శ్రీనివాస్, కందుల సైదులు, గద్దగ నగేష్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి

దేవరకొండ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేంధర్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని రహదారి బంగ్లాలో నిర్వహించిన బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆర్డినెన్స్ తీసుకొచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో సైతం బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్, అరవిందాచారి, గుర్రం రామ్‌కుమార్, తోటపల్లి మల్లేష్, సాయిరాం, హరీష్, మట్టపల్లి అనిల్, కుంభం రవి, లింగయ్య, రమేష్‌గౌడ్, శివ, రామకృష్ణ తదితరులున్నారు.


మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ యుగేందర్

నిడమనూరులో తిరంగా ర్యాలీ

నిడమనూరు : నిడమనూరు మండలకేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. 'మనం సైతం దేశం కోసం' నినాదంతో పెద్ద సంఖ్యలో యువకులు శనివారం నాడు దేశభక్తి నినాదాలు, సైనికుల త్యాగాలు, అమరులకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల పెహల్గాం దాడుల నేపథ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' భారత్ సైనిక శక్తికి అద్దం పట్టిందన్నారు. పలు దేశభక్తి గీతాలతో చిన్నారులు, పెద్దలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై వినీల్ రెడ్డి, చెన్ను వెంకట్ నారాయణ, స్థానిక యువకులు కే ఎస్ఎన్ రాజు, చాపల వెంకట్‌రెడ్డి, కావేటి రాము, నల్లబోతు వెంకటేశ్వర్లు, దొడ్డా ప్రసాద్, పోలేపల్లి యాదగిరి, పీరయ్య, పాలెం సాయి. పంతులు తుకారం, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.


తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

- ఐదవ అదనపు జడ్జి వేణు

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చక్కటి వేదిక లాంటిది జాతీయ లోక్ అదాలత్ అని మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వారు మాట్లాడారు. కేసుల పరిష్కారానికి రాజీనే రాజమార్గం అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులే అంతిమ తీర్పు అని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ అయిన కేసుల్లో కక్షిదారులు కోర్టుకు కట్టిన ఫీజులను తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. కాగా మిర్యాలగూడ కోర్టులోని లోక్‌అదాలత్‌లో 207 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యర్శులు నేతి సత్యానారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, జాతీయ లోక్ అదాలత్ సభ్యులు ఎస్ఆర్‌కె ప్రభాకర్, డి.రాజశేఖర్, కొంక వెంకన్న, జె.సుష్మిత, మేక కుమార్‌రెడ్డి, మొదాల మల్లేష్, సీనియర్ న్యాయవాది లింగంపల్లి అంజయ్య, జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి వేణు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ: కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, దేవరకొండ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె. అనిత అన్నారు. శనివారం దేవరకొండ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కేవీఎస్ హరీష్‌బాబు, ఏజీపీ నెమ్మికంటి రమాశంకర్, ఏపీపీలు రూపాంజలి, సంతోష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేష్, కర్నాటి సురేష్, గాజుల ఆంజనేయులు, భాస్కర్, గౌరీశంకర్, వనం జగదీశ్వర్, ఇడెం రవి తదితరులున్నారు.

941 కేసుల పరిష్కారం

నిడమనూరు : జాతీయ లోక్ అదాలత్‌లో నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 941కేసులు పరిష్కారమయ్యాయి. లోక్ అదాలత్‌లో రాజీ, జరిమానా విధించిన కేసులు–171, డ్రంక్ అండ్ డ్రైవ్–302, పీటీ కేసులు–471 కేసులు పరిష్కరించారు. జడ్జి టి.స్వప్న, పీపీ సాధన, బార్ సెక్రటరీ ఉన్నం చినవీరయ్య ఉన్నారు. లోక్ అదాలత్‌లో కోర్టు సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు తగిన ప్రాధాన్యం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి

హాలియా : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో స్వర్ణకార కార్మికులకు తగిన ప్రాధాన్యం కల్పించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి అన్నారు. శనివారం హాలియా పట్టణంలోని విశ్రాంత భవనంలో నిర్వహించిన స్వర్ణకార సంఘం జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ జ్యువలరీ షాపులతో స్వర్ణకార కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, పట్టణీకరణతో స్వర్ణకారుడికి జీవనోపాధి కష్టతరమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలతో స్వర్ణకారులకు పనుల్లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రస్తుతం స్వర్ణకార కార్మికులు ఎదుర్కొంటున్న స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించినట్లు ఆలోచన తెలిపారు. సమావేశంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర కోశాధికారి గట్టికొమ్ముల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు కూరెళ్ల మదనాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధనాచారి, కోశాధికారి కటకం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ విఠలాచారి. సలహాదారులు సత్యనారాయణ చారి, హాలియా పట్టణ అధ్యక్షుడు కటకం మురళి చారి, ప్రధాన కార్యదర్శి వల్లెం ప్రశాంత్‌రెడ్డి, కోశాధికారి వంగాల శివ కుమార్, ఉపాధ్యక్షుడు బ్రహ్మచారి, జిల్లా ఉపాధ్యక్షుడు శంభాయ చారి, గుండా రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

పెద్దవూర : పాఠశాలల్లో నాణ్య మైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించి విద్యాప్రమాణాలు పెంచాలని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నక్కల జానారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు సకాలంలో అందించాలని పేర్కొన్నారు. గతంలో లాగా పాము కాట్లు, ఫుడ్ పాయిజన్ వంటి పునరావృతం కాకుండా సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సౌకర్యాలను మెరుగుపర్చాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ప్రారంభిస్తామని సీఎం చెప్పడాన్ని ఏబీవీపీ స్వాగతిస్తుందని, ఇదే క్రమంలో ఉన్న పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని మెయింటైన్ చేయాలని అన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

పెద్దవూర : ఈ నెల 22, 23తేదీలలో కట్టంగూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్న కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో శిక్షణ తరగతుల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాంతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అవుతున్నా దళిత, గిరిజనులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. శిక్షణ తరగతులకు దళితులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దొంతాల నాగార్జున, దోరెపల్లి మల్లయ్య, దుబ్బ పరమేష్, చుక్కా రమేష్, తరి రామకృష్ణ, ఊరె ప్రభాకర్, మేదరి ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.


పెద్దవూరలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కొండేటి శ్రీను

బస్సులో పోగొట్టుకున్న పర్సు బాధితురాలికి అప్పగింత


బాధితురాలికి పర్సు అప్పగిస్తున్న కండక్టర్ వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల, మిర్యాలగూడ టౌన్: బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన పర్సును తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు కండక్టర్. వివరాలు.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన భీమవరపు మౌనిక శుక్రవారం మిర్యాలగూడ బస్టాండ్‌లో కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఎక్కి నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో దిగింది. ఆమె తన పర్సును బస్సులోనే మర్చిపోయింది. కండక్టర్ వెంకటేశ్వర్లు పర్సును గుర్తించి పరిశీలించగా.. అందులో సెల్‌ఫోన్‌తో పాటు రూ.1320 నగదు ఉండటంతో మిర్యాలగూడ డిపోలోని విచారణ కేంద్రంలో అప్పగించారు. బాధితురాలికి సమాచారం ఇచ్చి శనివారం పర్సును ఆమెకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్ వెంకటేశ్వర్లును డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

వేములపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్న బొస్క చిన సైదులు శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ గ్రామానికి చేరుకొని చిన సైదులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావు ఎల్లారెడ్డి, నాయకులు రేగట్టె రవీందర్‌రెడ్డి, పుట్టల కృపయ్య, గంజి శ్రీనివాస్, పుట్టల శ్రీను తదితరులు ఉన్నారు.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి..

జెడ్పీహైస్కూల్‌లో పనిచేస్తూ గుండెపోటుతో మృతిచెందిన బొస్క చిన సైదులు కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం చిన సైదులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్, కంచర్ల మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాము, రవి, అంజి, శ్రీనివాస్, గోపి, కృష్ణ, నర్సయ్య, సహదేవ్, వాసంతి, లక్ష్మి, మాధవి, పద్మ, నాగరాజు, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి


సోనియా

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌తండాకు చెందిన సపావత్ సుందర్ నాయక్, లక్ష్మీ దంపతుల కుమార్తె సపావత్ సోనియా శనివారం వెలువడిన నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 768వ ర్యాంకు సాధించింది. మొత్తం 720 మార్కులకు గాను 466మార్కులు సాధించి 95.56శాతంతో ఎస్టీ కేటగిరిలో నీట్ ర్యాంక్ సాధించడంపై తండావాసులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోనియా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తుర్కయంజాల్‌లోని సైనిక్‌స్కూల్‌లో, ఇంటర్మీడియట్ దిల్‌సుఖ్‌నగర్‌లోని నారాయణ కళాశాలలో పూర్తిచేసింది. ఇంటర్‌లో 978 మార్కులు సాధించగా తాజాగా వెలువడిన నీట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

నిడమనూరు : అమ్మ నాన్న ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందిస్తూ విద్యార్థులకు చేయూతనందివ్వడం అభినందనీయమని రైస్‌మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన బండారు పూజిత, జెడ్పీ ఉన్నత పాఠశాల బూడిద కీర్తన, గురుకుల కళాశాలలో చదివి ఇంటర్ ఎంపీసీలో 980 మార్కులు సాధించిన ఋషి పావనికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. నగదు ప్రోత్సాహకం భవిష్యత్ చదువులకు ఉపయోగించుకోవాలని కోరారు. పలు సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్‌ను పలువురు కొనియాడారు. అమ్మ–నాన్న ఫౌండేషన్ ద్వారా బంకాపురం లో వేసవిలో మజ్జిగ పంపిణీ, ప్రాథమిక పాఠశాలలో జిమ్, వైద్యసేవలకు ఆర్థికసాయం వంటి పలు సేవలందిస్తున్న అమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ అభినందనీయమని రాయపాటి పేరయ్య, ఉన్నం చిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బాలకృష్ణ మాజీ పీఏసీఎస్ చైర్మన్ పేరయ్య, మార్కెట్ మాజీ డైరెక్టర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఫౌండేషన్ కార్యదర్శి గూడెం రాజు, వెంకటేశ్వర్ రావు, గుండా లింగయ్య, బండారు రామయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మిల్లర్స్ అధ్యక్షుడు యాదగిరి, చైర్మన్ బాలకృష్ణ

విద్యా హక్కుచట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : విద్యా హక్కుచట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్ల గొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయని, కనిసం ప్రైవేటు, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం రామకృష్ణంరాజు, శివరామకృష్ణ, రామరాజు యాదవ్, నరేష్ ముదిరాజ్ తదితరులున్నారు.

నవోదయ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

హాలియా : ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్న ఎస్ఆర్‌కె నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులపై మండల విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవా లని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నవోదయ గురుకుల సైనిక్ కోచింగ్ సెంటర్ పేరుతో హాస్టల్ సౌకర్యం కలదు అంటూ విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, వర్షిత్, నవీన్ ఉన్నారు.

టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ) : టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో యువ పరివర్తన ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఏరియా మేనేజర్ మునేష్, శ్రీశైలం, కావ్య శ్రీ, అరుంధతి, శ్రీదేవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన రోడ్లను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకు వచ్చే దారిలో మురుగునీరు రోడ్లపై పారుతు దుర్వాసన వస్తోందని, గత కొద్ది రోజులుగా డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బావండ్ల పాండు, రవినాయక్, పరశురాములు, అయ్యూబ్, రామ్మూర్తి, సత్యనారాయణరావు, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మురుగు పారుతున్న ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి దీరావత్ లింగానాయక్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ 8వ మండల మహాసభ కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని అర్హులైన రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు అందించాలని, పేదలకు ఇల్లు, ఇళ్ల పట్టాలు అందించాలన్నారు. మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, స్థానిక ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. థర్మల్ ప్లాంట్ ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి, ఉదయ్, లక్ష్మయ్య, మల్లయ్య ఉన్నారు.